క్లుప్తంగా

ఎనిమిది గంటలు.. 13.50 ఎకరాల్లో సేద్యం!



కందిలో చిన్న గుంటకతో సేద్యం చేస్తున్న రైతు రాజేష్

విడపనకల్లు: మండలంలో మాళాపురం గ్రామంలో ఓ రైతు ఎనిమిది గంటల్లో 13.50 ఎకరాల కంది పంటలో చిన్న గుంటకతో కలుపుతీత సేద్యం చేసి రికార్డు సృష్టించాడు. పెద్ద కొట్టాలపల్లికి చెందిన కాకర్ల రవి పొలంలో మాళాపురం గ్రామానికి చెందిన లింగన్న కుమారుడు రాజేష్ ఉదయం 7.10 గంటలకు కందిలో చిన్న గుంటకతో పని చేయడం మొదలుపెట్టి మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి చేశాడు. దాదాపు ఎనిమిది గంటల్లో 13.50 ఎకరాల్లో కలుపు తీసి రికార్డు సృష్టించాడని గ్రామస్తులు అభినందించారు.

9వ డిస్ట్రిబ్యూటరీకి సాగునీరు విడుదల



నీరు విడుదల చేస్తున్న అధికారులు

విడపనకల్లు: మండలంలోని గాజుల మల్లాపురం వద్ద హెచ్చెల్సీ మెయిన్ కెనాల్ వద్ద 9వ డిస్ట్రిబ్యూటరీ కాలువకు శుక్రవారం అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు కలసి సాగునీరు విడుదల చేశారు. డిస్ట్రిబ్యూటరీ కింద వేల ఎకరాల ఆయకట్టు ఉండడంతో ఇప్పటికే రైతులు మిరప, పత్తి, జొన్న, వరి తదితర పంటలు సాగు చేసుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వ రరెడ్డి ఆదేశాల మేరకు అధికారులు సాగునీరు విడుదల చేశారు. కార్య క్రమంలో ఎంపీటీసీ దాసరి వెంకటేశులు, సర్పంచు బీబ్లారాణి, శంకర్‌గౌడు, రాజశేఖర్ తదితర రైతులు పాల్గొన్నారు.

అక్కమాంబ ఆలయ చైర్మన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని అక్కమాంబ ఆలయంలో దేవస్థానం చైర్మన్‌గా రాము, వైస్ చైర్మన్‌గా నాగిరెడ్డి శుక్రవారం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే కమిటీ సభ్యులుగా గురుస్వామి, రంగన్న, మారెక్క, సరోజమ్మ, ఎర్రమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి ఉషశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కిరీటి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గోపారం శ్రీనివాసులు, కౌన్సిలర్ రాము, సచివాయ కన్వీనర్ మంజు, ఒంటిమిద్ది, కురాకుల తోట, దేవాదులకొండ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో వినాయకుడు

కణేకల్లు: మండలంలోని గెనిగెర గ్రామంలో జీర్ణోద్ధరించిన ఆలయంలో శుక్రవారం వేకువజామున శాస్త్రోక్తంగా అర్చకులు వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. పురాతనమైన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు విరాళాలు సేకరించి కొత్త ఆలయాన్ని నిర్మించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయంలో రెండ్రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు చేపట్టారు. శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవ, పారాయణం, పీఠపూజతోపాటు అర్చకులు వినాయక విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికొచ్చి వినాయకునికి పూజలు జరిపించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి వినాయకున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శోభ

- తొలి శుక్రవారం ఘనంగా పూజలు



రాయదుర్గం: అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



డీహిరేహాళ్‌లో: పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారు

రాయదుర్గం/రాయదుర్గంటౌన్: శ్రావణమాసం అంటేనే శుభప్రదం. ఈసారి అధిక శ్రావణం రావడంతో అదనంగా మరోనెల రోజులు మహిళలు ఎదురుచూడాల్సి వచ్చింది. గురువారం నుంచి నిజ శ్రావణం ప్రవేశించడంతో ఆలయాలకు శ్రావణశోభ సంతరించుకుంది. రాయదుర్గం పట్టణంలోని ప్రముఖ ఆలయాలతోపాటు అమ్మ వారి ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తొలి శుక్రవారం పట్టణంలోని వాసవీమాత ఆలయం, నేసేపేట, కళ్లీమఠం హైస్కూల్ వద్ద మహాలక్ష్మీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, నానావిధద్రవ్యాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి, మంత్రపుష్పార్చన, విశేష పూజలు చేపట్టారు. శ్రీవాసవీ నగరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అర్చకుడు మంజునాథ స్వామి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే డి హీరేహాళ్ మండలంలోని ఓబుళాపురం సమీపాన కర్ణాటక సరిహద్దులో వెలసిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఉదయం నుంచి భక్తులతో పోటెత్తింది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కుతీర్చారు. నెల రోజుల పాటు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఆశ్రమ పీఠాధిపతి రఘు స్వామి ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. అలాగే నియోజకవర్గంలోని బొమ్మనహాళ్, కణేకల్లు, గుమ్మఘట్ట, డీహిరేహాళ్, రాయదుర్గం, అర్బన్ ప్రాంతాల్లో వెలసిన పలు దేవతామూర్తుల ఆలయాల్లోనూ విశిష్ట పూజలు నిర్వహించారు.

25న వరలక్ష్మీ వ్రతపూజ..

శ్రావణమాసంలో రెండో శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తారు. ఈ నెల 25న అమ్మ వారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాయదుర్గం పట్టణంలోని కళ్లీమఠం స్కూల్ వద్ద వెలసిన మహాలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఊపందుకున్న వ్యాపారాలు, శుభ ముహూర్తాలు

అషాఢమాసం, అధిక శ్రావణమాసం సందర్భంగా వ్యాపారాలకు, శుభ ముహూర్తాలకు రెండు నెలల పాటు బ్రేక్ పడగా నిజ శ్రావణం రావడంతో శుభ ముహూర్తాలు జోరందుకున్నాయి. రెండు నెలల విరామం అనంతరం పెళ్లిలు, ఇతర శుభకార్యాలతో మార్కెట్ కిటకిలాడుతోంది. వ్యాపారాలు ఊపందుకోవడంతో చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శ్రావణమాసంలో వివిధ ఉత్తమ తేదీల్లో పెళ్లిళ్లకు కళ్యాణమంటపాలు హౌస్‌ఫుల్ అయ్యాయి. మరోవైపు వస్త్రదుకాణాలు, బంగారు, వెండి, కిరాణ, తదితర వ్యాపారాలు జోరందుకుంటున్నాయి.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు





మాళాపురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఉరవకొండ: రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

విడపనకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందాయని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాళాపురంలో ఎస్సీ, బీసీ కాలనీలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సీఎం జగన్ పరిపాలనలో సంతోషంగా ఉన్నామని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వారు సమస్యలు తెలుసుకున్నారు. బీసీ కాలనీలో తాగునీటి సమస్య వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకి ఫోన్‌లో ఆదేశించారు. అంతకుముందు మహిళలు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, వైస్ ఎంపీపీ సునీతారాణి, నాయకులు కరణం భీంరెడ్డి, సర్పంచు మోదుపల్లి రామాంజనేయులు, ఎంపీటీసీలు తిమ్మరాజు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, మార్కెట్ యార్డు డైరెక్టర్లు హేమావతి, కురుబ రమేష్, మేకల రామాంజనేయులు, పేరెంట్ కమిటీ చైర్‌పర్సన్ వంద్రమ్మ, ప్రకాష్‌గౌడు, నాగన్న గౌడు, ఓబుళప్ప, వెంకటేశులు, జగన్నాథ్, జయరాం, బాలు, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

ఉరవకొండ: ఉరవకొండ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక షిరిడీసాయినగర్‌లో రూ14.50 లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో ఇప్పటికే రూ.కోటి వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని, అలాగే గడప గడపలో గుర్తించిన అత్యవసర పనులు చేపడుతున్నామన్నారు. ఎంపీ రంగయ్య నిధులతో ఇప్పటికే నియోజకవర్గంలో శ్మశాన వాటిక అభివృద్ధి, రోడ్లులకు నిధులు మంజురు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, మూలగిరిపల్లి ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

తిరుపాల్‌శెట్టి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది..

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చాబాల తిరుపాల్‌శెట్టి మృతి పార్టీకి తీరని లోటని, కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ఉరవకొండ పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన తిరుపాల్‌శెట్టి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఓదార్చారు. ఈ సందర్భంగా తిరుపాల్‌శెట్టితో తన కున్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తక్షణ సాయం పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పైతోట ఏరియాలో గురువారం రాత్రి అనారోగ్యంతో నాయకుల తిమ్మప్ప(47) మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ నగదు సాయాన్ని నామిని, మృతుడి భార్య శివలింగమ్మకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి శుక్రవారం కౌన్సిలర్ సంజీవప్ప అందజేశారు. బీమా కింద మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాకు త్వరలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ అశ్వర్థరెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, వలంటీర్లు తిప్పేస్వామి, రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

బెళుగుప్ప: మండలంలోని హనిమిరెడ్డిపల్లికి చెందిన బోయ సురేష్ ఈనెల 17న కురుకుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రైతు కూలీ అయిన సురేష్ మృతితో ఆ కుటుంబానికి దిక్కులేకుండా పోయింది. మృతుడి కుటుంబానికి శుక్రవారం జెడ్పీటీసీ సభ్యురాలు మమత, పార్టీ నాయకుడు త్రిలోక్‌నాథ్ రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఆ కుటుంబానికి అన్నీ విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరు

కూడేరు: మండల వ్యాప్తంగా 144 మందికి నూతనంగా రేషన్ కార్డులు మంజూరైనట్లు సీఎస్‌డీటీ లక్ష్మీదేవి శుక్రవారం తెలిపారు. ఇంకా అర్హత ఉండి రేషన్ కార్డులు లేని వారుంటే దర ఖాస్తు చేసుకోవాలని, మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

గుమ్మఘట్ట: గ్రామీణ ప్రాంతాల్లో రీ సర్వే పనులను వేగవంతం చేయాలని తహసీల్దార్ బ్రహ్మయ్య సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రంగసముద్రం, హొసళ్లి గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రారంభం కావడంతో.. రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృహత్ ప్రణాళికలతో రీ సర్వే పనులకు శ్రీకారం చుట్టారన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, సర్వేయర్లకు సహకరించాలన్నారు.

వార్డు మెంబర్ ఉప ఎన్నికకు సిద్ధం



ఎన్నికల సామగ్రి సిద్ధం చేసుకుంటున్న అధికారులు

కూడేరు: మండలంలోని కలగళ్ల పంచాయతీలో 9వ వార్డు మెంబర్ ఉప ఎన్నిక శనివారం జరగనుంది. ఆ వార్డులో 134 మంది ఓటర్లున్నారు. ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఓటింగ్ సంబంధించిన మెటిరియల్, బాక్స్‌లను శుక్రవారం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, ప్రిసైడింగ్ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో సిద్ధం చేసుకుని కలగళ్లకు తీసుకెళ్లారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓటింగ్, 2 గంట నుంచి కౌంటింగ్ ఉంటుందని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

వినాయక ఉత్సవ సమితి కార్యాలయం ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలో మహాగణపతి ఏర్పాటు, ఉత్సవాల్లో భాగంగా వినాయక ఉత్సవ సమితి కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతపురం రహదారి ఎంపీడీఓ కాంప్లెక్స్ భవన సముదాయంలోని 2వ రూములో కార్యాలయం ఏర్పాటు చేశారు. సమితి అధ్యక్షుడు గొని ప్రతాప్‌రెడ్డి,, కార్యదర్శి రాజేష్ , గౌరవాధ్యక్షుల తాయి శేఖర్, బీసా శ్రీనివాసులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సరుకులు పంపిణీ చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని పట్టణంలోని 23వ వార్డు ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సర్వర్ స్లోగా ఉండడంతో సరుకుల పంపిణీ ఆలస్యమైందని, కాలనీవాసులందరికీ సరుకులు పంపిణీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త

బొమ్మనహాళ్: ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ శివ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త రకంతో మోసాలకు పాల్పడుతున్నారని, వాట్సాప్‌లో లింకులు పంపిస్తూ దీనిని క్లిక్ చేస్తే ఆఫర్లు వస్తాయని, కొత్తరకాల యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వచ్చిన లింకును మరొకరికి ఫార్వర్డ్ చేయకూడదన్నారు. ఏదైనా పొరపాటు జరిగినా మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని, మీ వ్యక్తిగత సమాచారన్ని కూడా ఆ లింకులతో నమోదు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే మీరే నష్టపోతారని, దీనికి ఎవరూ బాధ్యులు కారన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బొమ్మనహాళ్: మండలంలోని గోనేహాళ్ గ్రామానికి చెందిన కురుబ నాగరాజు అనుమతిలేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండడంతో ఎస్ఐ శివ స్వాధీనం చేసుకొని శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని వేదావతి హగరి నుంచి ఇసుక అక్రమంగా గోనేహాళ్‌కు రవాణా చేస్తుండడంతో.. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఘనంగా కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి జన్మదినం



వినాయక సర్కిల్‌లో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్న నాయకులు, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం అట్టహాసంగా జరుపుకున్నారు. పట్టణంలోని వినాయక సర్కిల్‌లో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరు కాగా భారీ కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి యువనేత కాపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు గోవిందరాజులు, డిష్ గోవిందు, మంజునాథ, ప్రతాప్, నజీర్, బేలోడు సర్పంచ్ ఉమేష్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు గోరంట్ల సత్యనారాయణ, గోల్డ్ ఇస్మాయిల్, బషీర్ అహ్మద్, గంగాధర్, పైతోట రఘు, శివప్ప, భీమసపల్లి దివాకర్, నిజాముద్దీన్, నాగరాజు(ఓబ), పవన్‌కుమార్, జియా, త్రయంబకరెడ్డి, మల్లికార్జున, బాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఎమ్మెల్యే కేశవ్ కుట్ర



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్ల తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు ధ్వజమెత్తారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, కమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, వెంకటేష్, పార్టీ రాష్ట్ర నాయకులు అశోక్, మూలగిరిపల్లి ఓబన్న తదితరులతో కలసి వారు మాట్లాడారు. ఎమ్మెల్యే కేశవ్ ఈసారి ప్రజలు తనను చిత్తుగా ఓడించడం ఖాయమని భావించి వైఎస్సార్‌సీపీ సానుభూతి ఓట్లను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడన్నారు. ఏ నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పట్టని కేశవ్ ఇప్పటి నుంచే తప్పుడు మార్గాలను అన్వేషిస్తు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఎమ్మెల్యే కేశవ్ తన పచ్చమీడియా ద్వారా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిపై తప్పుడు రాతలు రాయిస్తున్నారన్నారు. పోరాడే ధైర్యం లేక ఎంపీ రఘురామకృష్ణ రాజుతో ఎన్నికల కమిషన్‌కు ఉరవకొండలో బతికి ఉన్న ఓటర్లను చనిపోయారని, వాటిని తొలగించాలని కేశవ్ దుర్మార్గంగా ఫిర్యాదు చేయించారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేశవ్ ఇలాంటి తప్పుడు ఫిర్యాదు ఇప్పించడం మాని, నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలడుగు వంశీ, హనుమప్ప,భీమా, శీనా, వన్నూర్, మల్లి, సలీం, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యుడు విజయ్‌కుమార్

కణేకల్లు: వ్యక్తిగత పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్‌నాయక్ సూచించారు. కణేకల్లులోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం పరిశుభ్రత–సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఓ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి



మాట్లాడుతున్న ఎంపీపీ పెద్దన్న

బెళుగుప్ప: సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ పెద్దన్న సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో వచ్చే అర్జీలపై అధికారులు స్పదించాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశాలకు కుడా చాలామంది అధికారులు గైరుహజరు కావడం పట్ల ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.14 లక్షలు కరెంట్ బిల్లల బకాయిలకు కట్ చేయడంపై విద్యుత్ అధికారిపై రమణేపల్లి సర్పంచ్ రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండ్లపల్లి సర్పంచ్ పురుషోత్తం మాట్లాడుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నర్సరీలతో నాసిరకం పైరు సాగుచేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబుళేసు, ఎంపీడీఓ రామచంద్ర, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సింగల్‌విండో డైరెక్టర్ శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు ఔషధాల పంపిణీ



మందులను పంపిణీ చేస్తున్న డాక్టర్ వెంకటేష్

ఉరవకొండ: డివిజన్ పరిధిలోని ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, శెట్టూరు, గుంతకల్లు, బెళుగుప్ప, వజ్రకరూరు, బొమ్మనహాళ్, కణేకల్లు ఆర్‌బీకేలకు పశువులు, గొర్రెలకు అవసరమయ్యే అత్యవసర మందులను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయా సచివాలయాల పశుసంవర్ధక శాఖ సహాయకులకు ఉరవకొండ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ వెంకటేష్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకెల్లో అత్యవసర మందులను అందుబాటులో ప్రభుత్వం ఉంచుతోందన్నారు. గ్రామాల్లో పశువులకు ఎలాంటి రోగాలు సోకినా వెంటనే పాడి రైతులు ఆర్‌బీకేల వద్దకు వెళ్లి మందులు ఉచితంగా తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ పశుసంవర్ధక శాఖ వైద్యులు వెంకటశర్మ, నరేష్ పాల్గొన్నారు.

వేగంగా హైస్కూల్ భవన నిర్మాణ పనులు



కొర్రకోడులో నిర్మాణంలో ఉన్న హైస్కూల్ భవనం

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రవేశ పెట్టిన నాడు–నేడు పథకంతో కూడేరు మండలంలోని కొర్రకోడులోని హైస్కూల్‌కు మహర్దశ వచ్చింది. నాడు–నేడు కింద హైస్కూల్ నిర్మాణానికి రూ.1.87 కోట్లు నిధులు మంజూరయ్యాయి.ఈ నిధులతో తొమ్మిది తరగతి గదులు, కిచెన్, టాయిలెట్స్, ప్రహరీని నిర్మిస్తున్నారు.భవన నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి .నిర్మాణపు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు పనులు తొందరగా ముందుకు సాగేలా చర్యలు చేపడుతున్నట్లు పీఆర్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. డిశంబర్ నెలాఖరుకు నిర్మాణపు పనులు పూర్తి చేయిస్తామన్నారు. నూతన భవనం ప్రారంభమైతే పాత భవనంలో విద్యనభ్యసిస్తున్న సుమారు 250 మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గదుల కొరత , అసౌకర్యాలు తప్పుతాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాయదుర్గంటౌన్: గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం బోల్తా పడి ఓ వ్యక్తికి గాయాలైన ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వెంకీ అనే వ్యక్తి పూల వ్యాపారం ముగించుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామైన కర్ణాటకలోని మొలకాల్మూరుకు వెళుతూ సిరిగేదొడ్డి గ్రామ సమీపంలో అదుపు తప్పి కిందపడ్డాడు. గాయపడిన అతడిని స్థానికులు 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

బ్రహ్మసముద్రం: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని బాలాజీ వికలాంగుల సంఘం సభ్యులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలాజీ వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులకు నెలకు పింఛన్ రూ.6 వేలకు పెంచాలన్నారు. ఉపాధి పథకంలో దివ్యాంగులకు సులువైన పనులు కల్పించాలని, కనీస వేతనం రూ. 600 ఇవ్వాలన్నారు. ప్రతి దివ్యాంగుడికీ 2 ఎకరాల భూమి కేటాయించి ఆదుకోవాలని కోరారు . అదేవిధంగా దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో బాలాజీ మండల సమాఖ్య సభ్యులు చన్నమల్లప్ప, నరసింహులు, శివశంకర్, మృత్యుంజయ, నాగిరెడ్డి, నీలమ్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.